## క్లుప్తంగా

### అసిస్టెంట్ ప్రొఫెసర్ లోవరాజుకు పీహెచ్‌డీ



చేబ్రోలు: మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని ఈసీఈ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ కొమ్మోజు లోవరాజుకు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. ' ఇంప్లిమెంటేషన్ ఆఫ్ యాన్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ బేస్డ్ క్లౌడ్ ఎనేబుల్డ్ సర్వీస్ ఫర్ స్మార్ట్ అగ్రికల్చర్ మోనిటరింగ్ అండ్ డెసిషన్ మేకింగ్ సిస్టమ్' అనే అంశంపై ఆయన పరిశోధన చేశారని తెలిపారు. పీహెచ్‌డీ పట్టా పొందిన లోవరాజును పలువురు అభినందించారు.

### బాలికలకు సైకిళ్లు అందజేత



చేబ్రోలు: మండలంలోని నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న గొడవర్రు గ్రామానికి చెందిన ఐదుగురు బాలికలకు తెనాలి రోటరీ క్లబ్ ఆర్థిక సహకారంతో మంగళవారం సైకిళ్లను పంపిణీ చేసినట్లు హెచ్‌ఎం ఏడుకొండలు తెలిపారు. బాలిక విద్యను ప్రోత్సహించటంలో భాగంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఈ ఏడాది ఇప్పటి వరకు 600 మంది విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేసినట్లు రోటరీక్లబ్ ప్రతినిధులు తెలిపారు. నారాకోడూరు పాఠశాలలో పదవ తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు ఇస్తామని రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఈదర శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెక్రెటరీ డి.మురళీకృష్ణ, సభ్యులు ఈదర వెంకట పూర్ణచంద్, రాజేంద్రప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### స.హ. చట్టంపై రైతులకు అవగాహన

గార్లపాడు(కాకుమాను): సమాచార హక్కు చట్టాన్ని ప్రతి రైతు ఉపయోగించుకోవాలని పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరి అన్నారు. మండలంలోని గార్లపాడులో మంగళవారం రైతు సమాచార హక్కు చట్టంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రామకోటేశ్వరి మాట్లాడుతూ ప్రతి రైతుకు సాగు విషయంలో సూచనలు, సలహాలు ఇవ్వాలనే లక్ష్యంతో 2005లో అప్పటి కేంద్ర ప్రభుత్వం సమాచార హక్కు చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ చట్టం ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి కార్యక్రమాన్ని చట్టం ద్వారా తెలుసుకోవచ్చునని పేర్కొన్నారు. ఏఓ కిరణ్మయి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కోరిన రైతులకు సంబంధిత అధికారుల నుంచి 30 రోజులలో పూర్తి సమాచారాన్ని అందిస్తారని వివరించారు.

### గోల్డెన్ అవర్‌లో బాధితుడికి చికిత్స అందించాలి

డాక్టర్ ఉప్పుటూరి అరుణకుమారి



గుంటూరు మెడికల్: స్ట్రోక్ వచ్చిన బాధితుడికి నాలుగున్నర గంటల వ్యవధిలో గోల్డెన్ అవర్‌లో చికిత్స అందిస్తే స్ట్రోక్ తీవ్రతను వెంటనే తగ్గించవచ్చని గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఉప్పుటూరి అరుణకుమారి అన్నారు. వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా మంగళవారం గుంటూరు జీజీహెచ్‌లో న్యూరాలజీ విభాగం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ర్యాలీని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఎస్.వి.రమణ ప్రారంభించారు. పక్షవాతంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటం ద్వారా వ్యాధి బారిన పడకుండా వచ్చన్నారు. జీజీహెచ్ న్యూరాలజీ వైద్యులు స్ట్రోక్ బాధితులకు అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని డాక్టర్ రమణ పేర్కొన్నారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు భవిష్యత్తులో విస్తృతంగా నిర్వహించాలన్నారు. డాక్టర్ అరుణకుమారి మాట్లాడుతూ వ్యాధి గురించి వివరించి లక్షణాలను గుర్తించిన వెంటనే వైద్యుల వద్దకు తీసుకెళ్లాలని చెప్పారు. న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ సత్యనారాయణ మూర్తి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ స్ట్రోక్ చికిత్సలో సర్జరీ ప్రాముఖ్యత గురించి వివరించారు. న్యూరాలజీ అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ బిందునర్మద, డాక్టర్ భార్గవి దేవి మాట్లాడుతూ ప్రతిరోజూ వ్యాయామం చేయడం ద్వారా స్ట్రోక్ బారిన పడకుండా ఉండవచ్చు అన్నారు.

# ధరలు బోర్డులకే పరిమితం

- నిడుబ్రోలు రైతు బజారులో అధిక ధరలకు కూరగాయల అమ్మకాలు
- పట్టించుకోని అధికారులు



రైతు బజారులో కూరగాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

పొన్నూరు: మార్కెట్‌లో కూరగాయలు ధరలు మండిపోతున్నాయి. వరదలు సాకుతో ధరలకు రెక్కలొచ్చాయి. రైతు బజారుల్లో పట్టిక ధరలకు అమ్మకాలు లేకపోవడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని నిడుబ్రోలు రైతు బజారులో బోర్డుపై ఉన్న ధరల కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై వ్యాపారులను ప్రశ్నిస్తే సరుకు లేదు, నచ్చితే తీసుకోండి లేకపోతే బయట తీసుకోండి అంటూ సమాధానం ఇస్తున్నారని వాపోతున్నారు. కూరగాయలు పండించిన రైతులకు వాటిని విక్రయించుకునేందుకు ఏర్పాటైన రైతు బజార్‌లు వ్యాపారులకు కేంద్రాలుగా మారాయి. రైతులకు దుకాణాలను కేటాయించడంలో నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వ్యాపారులకు సహకరించడంతోనే రైతులు దూరమవుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు.

## రైతు బజార్లపై నిర్లక్ష్యం...

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు కాకుండా అధిక ధరలకు కూరగాయలు విక్రయిస్తున్నా రైతు బజారు అధికారులు పట్టించుకోవడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. కిలో టమాటా రూ.38 అని ఉంటే రూ.7 అదనంగా వేసుకుని రూ.45కి విక్రయిస్తున్నారు. ధరల పట్టికలో ఉన్న ధరలకు కూరగాయలు ఇవ్వాలంటే పుచ్చులతో సహా అన్నీ కొనుగోలు చేయాలని చెబుతుండటంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఒక్క టమాటానే కాదు రైతు బజారులో లభ్యమయ్యే అన్ని కూరగాయలను బోర్డులో నిర్దేశించిన ధరల కంటే అధిక ధరలకే అమ్మకాలు చేస్తున్నారు. సామాన్యులపై అధిక ధరల భారం పడకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ధరల పట్టికలో నిర్ణయించిన ధరలకే కూరగాయలు అమ్మకాలు చేపట్టే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రచారం లేక వెలవెలబోతున్న విక్రయకేంద్రం

## ప్రచార ఆర్భాటమే..

కూటమి ప్రభుత్వంలో పేద, మధ్యతరగతి కుటుంబాల పోషణకు ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారంలోకి వస్తే నిత్యావసర ధరలను నియంత్రిస్తామని హామీ ఇచ్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఆ హామీని గాలికొది లేసింది. నిత్యావసర ధరలు ఆకాశాన్ని తాకుతుండటంతో సామాన్య ప్రజలు కొనలేని పరిస్థితి నెలకొంది. ధరలు తగ్గిస్తామని, రైతు బజారుల్లో రాయితీపై అందిస్తామని ప్రభుత్వం చెపుతున్నా.. ప్రచారం కొరవడి క్షేత్ర స్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. నిత్యావసరాల ధరలు తగ్గించామంటూ ప్రభుత్వం చేసిన ప్రచారం ఒకటి రెండు రోజుల ప్రకటనలకే పరిమితమైంది. విక్రయ కేంద్రంలో బియ్యం, కందిపప్పు, పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ అందుబాటులో ఉంచామని, రాయితీపై అందిస్తున్నామని చెప్పినా సరైన ప్రచారం లేక విక్రయకేంద్రాలు వెలవెలబోయాయి. ఉల్లి ధరలు ఆకాశాన్నంటడంతో తగ్గించి రైతు బజార్ల ద్వారా ప్రజలకు అందిస్తామని చెప్పిన ప్రభుత్వం ఆచరణలో విఫలమైంది. సబ్సిడీపై అందించే ఉల్లి అందుబాటులో లేకపోవడంతో ప్రజలు రైతు బజార్‌కు వచ్చి వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది.

**అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు**

మార్కెటింగ్ శాఖ నిర్ణయించిన ధరల కంటే ఎక్కువగా విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటాం. ధరల పట్టికను అనుసరించి విక్రయాలు జరపాలి. రైతు బజార్‌లో వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా చేస్తాం.

–రమేష్, ఈఓ, రైతు బజార్

**రైతు బజారులో ధరల వివరాలు..**

| కూరగాయలు | (కేజీల్లో ధర) |
|---|---|
| క్యాప్సికమ్ | రూ.80 |
| బీన్స్ | రూ.120 |
| కారెట్ | రూ.55 |
| గోరుచిక్కుళ్లు | రూ.50 |
| కాకర | రూ.42.54 |
| బీట్ రూట్ | రూ.36 |
| చామదుంప | రూ. 42 |
| దోసకాయ | రూ.42 |
| కేబేజీ | రూ.32 |
| కీరదోస | రూ.20 |
| టమాటా | రూ.38 |
| వంకాయలు | రూ.40 |
| బెండకాయలు | రూ.54 |
| బంగాళదుంపలు | రూ.42 |
| దొండకాయలు | రూ.46 |
| ఉల్లి | రూ.34 |
| బీరకాయలు | రూ.50 |
| కాకరకాయలు | రూ.25 |



దుకాణాల వద్ద పెట్టిన ధరల పట్టిక

### సిరిధాన్యాలపై అవగాహన సదస్సు

గుంటూరు రూరల్: ఆరోగ్య, ఆహార నిపుణులు డాక్టర్ సరళా ఖాదర్‌తో సిరిధాన్యాలతో జీవన సిరిపై నవంబర్ 8 నుంచి పదో తేదీ వరకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రైతు నేస్తం ఫౌండేషన్‌చైర్మన్ వై.వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్షక సేవా కేంద్రం నిర్వహణలో నిర్వహించనున్నట్లు చెప్పారు. 97053 83666, 70939 73999 నంబర్లలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

### ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం



గుంటూరు రూరల్: భగవాన్ ధన్వంతరి జయంతి సందర్భంగా నేషనల్ ఆయుర్వేదిక్ డేను మంగళవారం జరుపుకోవటం సంతోషకరమని శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు తెలిపారు. నగర శివారుల్లోని ఇన్నర్‌రింగ్ రోడ్డు ఫేజ్- 1 రెడ్డిపాలెం సమీపంలోని ఆయుర్వేదిక్ ఆస్పత్రిలో నేషనల్ ఆయుర్వేదిక్ డే సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యానికి మూల పురుషుడు భగవాన్ ధన్వంతరి అని తెలిపారు. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేని వైద్యం ఆయుర్వేదం అని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి గాంచిన కొట్టక్కల్ ఆర్యవైద్యశాలను గుంటూరులో నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ ఆయుర్వేద వైద్యాన్ని పొంది ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. మందులు పంపిణీ చేశారు.

# ఆరోగ్యకరమైన పంటలు సాగుచేయాలి

- జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి
- రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని సూచన
- పంట పొలాల్లోకి వెళ్లి పంటల పరిశీలన



పమిడివారిపాలెంలో బ్లాక్ రైస్ పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

పమిడివారిపాలెం(కాకుమాను): ప్రతి రైతు ఆరోగ్యకరమైన పంటలను సాగు చేసి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కోరారు. మండలంలోని పమిడివారిపాలెంలో మంగళవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది'లో కలెక్టర్ హాజరయ్యారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ తక్కువ ఖర్చులతో ఎక్కువ దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి మంగళ, బుధవారాల్లో గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తోందని వివరించారు. ప్రతి రైతు ఏటా ఒక సాగు చేయకుండా పంట మార్పిడి విధానాన్ని పాటించాలని చెప్పారు. గ్రామానికి చెందిన రైతు కొమరనేని సోమ శేఖరరావు అనే రైతుని ప్రతి రైతు ఆదర్శంగా తీసుకుని పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలని కోరారు. ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులు రైతులకు భిన్నంగా ఉన్నాయని ఏటా ఒకే రకం పంట సాగు చేయడం, ఇష్టానుసారంగా రసాయనిక ఎరువులు వాడడం వలన ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయని హెచ్చరించారు. తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు కలిగిన ఎర్ర, నల్ల ధాన్యాల పంటపై రైతులు దృష్టి పెట్టాలని అప్పుడే రైతులకు ఖర్చులు తగ్గడంతో పాటు ఆరోగ్య కరమైన జీవనం సాధ్యమని వివరించారు. వరి పంటలతో పాటు ఇంటి పరిసరాల్లో ఉన్న ఖాళీ స్థలాలను నిరుపయోగంగా ఉంచకుండా కూరగాయ మొక్కలను నాటుకోవాలని ఆమె సూచించారు.

**అప్పాపురం చానల్‌కు నీరు లేదు..**

గ్రామానికి చెందిన పలువురు రైతులు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు అప్పాపురం చానల్‌కు ఒక్క చుక్క కూడా సాగు నీరు విడుదల కాలేదని దేవుడు కరిణించిన వర్షాలతోనే ఇప్పటి వరకు సాగు చేస్తామని రబీ సీజన్‌లో సకాలంలో సాగు నీరు అందించాలని కలెక్టర్ వేడుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సకాలంలో సాగునీరు అందించే విధంగా కృషి చేస్తానని ఆమె రైతులకు హామీ ఇచ్చారు. ఈసందర్భంగా కాకుమానులోని ఓ విత్తనాల దుకాణంలో వరి వంగడాలు కొనుగోలు చేసి నాటగా అందులో ఒక వంతు కేళీ(ఈనిక దశ ముందుగానే ఈనడం) జరిగిందని దీని వలన దిగుబడులు తగ్గే అవకాశాలు ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వారం రోజులలో రైతులకు జరిగిన నష్టం గురించి సీడ్ యజమానులతో మాట్లాడి ప్రతి రైతుకి న్యాయం చేస్తామని హామీనిచ్చారు. ఎస్సీ కాలనీకు చెందిన పలువురు తమ గ్రామానికి బస్సు సౌకర్యం లేదని మేము మండల కేంద్రానికి వెళ్లాలంటే అనేక ఇబ్బందులు పడుతున్నామని మా గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు సౌకర్యం కల్పిస్తామని కలెక్టర్ కాలనీ వాసులకు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, ఉద్యానశాఖ డెప్యూటీ డైరెక్టర్ రవీంద్రబాబు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి, పశుసంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ నరసింహారావు పాల్గొన్నారు.

## ప్రాంగణ ఎంపికల్లో ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలకు అర్హత పొందిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉపాధి కల్పనే లక్ష్యంగా నైపుణ్యంతో కూడిన విద్యనందిస్తున్నట్లు ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని పేర్కొన్నారు. మంగళవారం చౌడవరంలోని కళాశాలలో ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ పాల్టెక్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో కళాశాలకు చెందిన 17 మంది విద్యార్థులు రూ.6 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలను పొందారు. విద్యార్థులను కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వి శ్రీనివాసరావు, ప్లేస్మెంట్ ఆఫీసర్స్ సిహెచ్.శ్రీనివాసరావు, డాక్టర్ కె.సురేష్‌బాబు పాల్గొన్నారు.

## పెరిగిన ఇసుక ధరలతో నిలిచిన నిర్మాణాలు



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

పొన్నూరు: కూటమి ప్రభుత్వం అమలు చేసిన ఇసుక నూతన విధానం వలన ఇసుక దొరకడం లేదని ఏఐటీయూసీ జిల్లా నాయకులు పుప్పాల సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో గుంటూరు జిల్లా ప్రజానాట్య మండలి కార్యదర్శి ఆరేటి రామారావు అధ్యక్షతన ఏఐటీయూసీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సత్యనారాయణ మాట్లాడుతూ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి కార్మికులను ఆదుకుంటామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఇప్పటికైనా మాట నిలబెట్టుకోవాలన్నారు. సమావేశంలో రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మిక్కిలి జాన్, కార్పెంటర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు శ్రీనివాసరావు, ఆటో యూనియన్ అధ్యక్షులు రామారావు, శ్రీనివాసరావు, సుభాని గౌస్, తిరుపతయ్య, భరత్ పాల్గొన్నారు.

## పీకలవాగు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని పీకలవాగు వెంబడి కల్వర్టు, రెయిలింగ్ ఏర్పాటు చేయాలని, పీకలవాగు ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం కమిషనర్ దేవాపురం, కోబాల్ట్ పేట ప్రాంతాల్లో పర్యటించి పీకలవాగు కల్వర్ట్స్, పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ దేవాపురం, కోబాల్ట్ పేటలో పీకలవాగుని పరిశీలించి, పలు ప్రాంతాల్లో కల్వర్ట్‌లు కూలిపోవడం చూసి తక్షణం అవసరమైన ప్రాంతాల్లో నూతన కల్వర్ట్‌లను రెయిలింగ్‌తో నిర్మాణం చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పీకలవాగు చుట్టూ పక్కల ఆక్రమణలు వాగులోకి వస్తున్నాయని, ఫలితంగా వర్షాల సమయంలో వాగు పొంగి ఇళ్లల్లోకి నీరు వచ్చి ప్రజలు ఇబ్బందులు పడుతున్న రీత్యా వాగు పరిసరాల్లో ఆక్రమణలను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను, మెయిన్ రోడ్ మీదకు ర్యాంప్‌లు, మెట్లు నిర్మాణం చేసిన వాటిని తొలగించాలని ప్లానింగ్ కార్యదర్శులకు సూచించారు. ప్రజారోగ్య కార్మికులు ప్రతి రోజు ఇంటింటి చెత్త సేకరణ చేయాలని, రోడ్ల మీద, కాల్వల్లో వ్యర్థాలను వేసే వారిని గుర్తించి అపరాధ రుసుం విధించాలని చెప్పారు. కార్యదర్శులు సమన్వయంతో ప్రతి రోజు తమ సచివాలయం పరిధిలో క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలన్నారు. సిల్ట్ కార్మికులతో ఎప్పటికప్పుడు మేజర్ డ్రెయిన్లలో సిల్ట్ తీయించాలని, అవసరమైన ప్రాంతాల్లో గ్యాంగ్ వర్క్ ద్వారా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ పర్యటనలో కార్పొరేటర్ బి.రాజలత, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, ఈఈ సుందర్రామిరెడ్డి, డీఈఈ నాగభూషణం, ఏసీపీ రెహ్మాన్, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, ఆర్ఓ శివన్నారాయణ, స్పెషల్ శానిటేషన్ ప్రత్యేక అధికారి నిరంజన్, ఎస్.ఎస్. సోమశేఖర్ పాల్గొన్నారు.

## వివాలో జర్మన్ విదార్థుల బృందం పర్యటన



నంబూరు వివాలో ఆటపాటలతో అలరిస్తున్న చిన్నారులు



వివాలో జర్మన్ విద్యార్థుల బృందం

పెదకాకాని: జర్మనీ న్యూరెంబర్గ్ నగరానికి చెందిన ఓం విశ్వవిద్యాలయంలోని ప్రొఫెసర్ డాక్టర్ బెర్హార్డ్ ఆధ్వర్యంలో డ్యూరర్, మార్టిన్ బెహం పాఠశాలలకు చెందిన 13 మంది విద్యార్థులు ఆరుగురు అధ్యాపకులతో కూడిన బృందం నంబూరు వివా స్కూల్‌ను సందర్శించింది. మండలంలోని నంబూరు వివా స్కూల్‌లో జరుగుతున్న మేథాన్-24 కార్యక్రమంలో భాగంగా ఈ బృందం మంగళవారం వివా పాఠశాలను సందర్శించింది. మూడు దశలలో నిర్వహించనున్న కార్యక్రమంలో మొదటి దశ అంతర్జాలం ద్వారా నిర్వహించగా, రెండో దశలో వివా విద్యార్థులు జర్మనీలో నిర్వహించిన మేక్థాన్ నందు పాల్గొన్నారు. మూడో దశలో భాగంగా జర్మన్ విద్యార్థులు వివా పాఠశాలలో జరుగు మేకథాన్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా వివా చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ నవంబర్ 2వ తేదీ వరకూ ఈ బృందం వివా పాఠశాలలో నిర్వహిస్తున్న మేకథాన్ 24లో పాల్గొంటుందన్నారు. ప్రత్యక్ష పరిజ్ఞానం లక్ష్యంగా విద్యార్థులలో సాంస్కృతిక సమ్మేళనం, పరిశీలనా దృష్టి, ఆలోచనల మార్పు కోసం కార్యక్రమం ఉపయోగపడుతుందని చెప్పారు. ఆరు దేశాలు, ఆరు రాష్ట్రాల సంస్కృతులు, సాంప్రదాయాలు, వేషధారణలను, ప్రముఖుల జీవిత విషయాలను ఈ కార్యక్రమంలో వివా విద్యార్థులు తెలియజేశారు. జర్మన్ అధ్యాపకులు సంప్రదాయ చీరకట్టులో ఈ కార్యక్రమంలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చదలవాడ సరళ, డైరెక్టర్ ఎల్‌టీ కమాండర్ కె.శ్రీనివాసరావు, ఐబీ ప్రోగ్రామ్ హెడ్ కె.మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ప్రధాన రహదారులకు ప్యాచ్ వర్క్స్ చేపట్టాలి

నెహ్రూ నగర్: గుంటూరు నగరంలోని ప్రధాన రహదారుల్లో ప్యాచ్ వర్క్స్, వీధి దీపాల నిర్వహణను ఇంజినీరింగ్ అధికారులు నిరంతర ప్రక్రియగా చేపట్టాలని, ప్రతి రోజు ఆయా అంశాలపై సమీక్ష చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం కౌన్సిల్ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్ అధికారులు, నూతనంగా విధులు కేటాయించబడిన అధికారులతో సమావేశం నిర్వహించారు. తొలుత నూతనంగా విధులు కేటాయించబడిన అధికారులతో మాట్లాడుతూ నగర ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వీధి దీపాలపై ప్రజల నుంచి పలు ఫిర్యాదులు అందుతున్నాయని, 24 గంటల్లో వీధి దీపాల సమస్యలు పరిష్కరించాల్సిందేనని స్పష్టం చేశారు. అనంతరం హౌసింగ్‌పై సమీక్ష చేసి లే అవుట్లలో ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా జరిగేల ఎమినిటి కార్యదర్శులు, నోడల్ అధికారులు చొరవ చూపాలన్నారు. త్వరలో కాంట్రాక్టర్లతో లే అవుట్ ల వారీగా ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, ఈఈలు సుందరరామిరెడ్డి, కోటేశ్వరరావు, హౌసింగ్ ఈఈ శంకరరావు పాల్గొన్నారు.

### డాక్టర్ మొవ్వా రామారావుకు నివాళి

గుంటూరు రూరల్: రైతుల ఉన్నతికి తన జీవితాంతం కృషి చేసిన మహనీయుడు సుప్రసిద్ధ ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ మెవ్వా రామారావు అని రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం వట్టిచెరుకూరు మండలంలోని పుల్లడిగుంట రైతు నేస్తం ఫౌండేషన్‌లో రామారావు సంతాప కార్యక్రమం నిర్వహించారు.

### ముసాయిదా ఓటరు జాబితా ప్రదర్శన



పొన్నూరు: స్పెషల్ సమ్మరీ రివిజన్ ఆఫ్ ఫొటో ఎలక్ట్రాల్ రోల్స్ 2025లో భాగంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాను మంగళవారం 264 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల పరిశీలన కోసం ప్రదర్శించారు. మండలంలోని వెల్లలూరు గ్రామం 152, 153 పోలింగ్ కేంద్రాలను ఈఆర్ఓ, తహసీల్దారు జియావుల్ హక్ సందర్శించి ఓటరు జాబితాను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. సంబంధిత పోలింగ్ బూత్‌లో ప్రదర్శించిన ఓటర్ల జాబితాలో ప్రజలు తమ ఓటు వివరాలను తనిఖీ చేసుకోవాలని సూచించారు.